వరంగల్ వాయిస్
Evening Daily
www.warangalvoice.net
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 235
శుక్రవారం | 22 మార్చి 2024 | పేజీలు : 08 | వెల రూ. 5




# నూకల యూ టర్న్

కారు దిగి కాంగ్రెస్‌లోకి నరేష్ రెడ్డి

కాంగ్రెస్‌లో ఆయన 'కల' నేరవేరనుందా..!

8లో

# మాదిగల ఎదుగుదలను అడ్డుకున్నది శ్రీహరే

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ



8లో

# కాంగ్రెస్‌దే ఘన విజయం



**రాజీవ్ గాంధీ పంచాయతీ సంఘటన్ రాష్ట్ర చైర్మన్ రాచమల్ల సిద్దేశ్వర్**

**వరంగల్ వాయిస్, జనగామ :** స్థానిక కాంగ్రెస్ జిల్లా పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ పంచాయతీ సంఘటన్ రాష్ట్ర చైర్మన్ రాచమల్ల సిద్దేశ్వర్ ఆధ్వర్యంలో శుక్రవారం రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దేశ్వర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం బిఆర్ఎస్ దుర్మార్గమైన పరిపాలనకు ప్రజలు చరమ గీతం పాడారని, రాష్ట్రంలో కల్వకుంట్ల కుటుంబం ఒక్కటే మింగేసిందని, ఏడు నుంచి ఎనిమిది లక్షల కోట్ల అప్పు చేసిందన్నారు. గత ప్రభుత్వం పాలనలో గ్రామ పంచాయతీకి రావలసిన నిధులను గత పాలకులు రాకుండా ఆలస్యం చేశారని, ద్వారా కొంతమంది సర్పంచులు వారి ఆస్తుల అమ్ముకోవడం, మహిళా సర్పంచులు అయితే వారి పుస్తెలు కూడా తాకట్టు పెట్టే పరిస్థితి ఏర్పడిందని, గ్రామ పంచాయతీలకు రావలసిన అన్ని నిధులను విడుదల చేసేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని, వచ్చే పార్లమెంట్ ఎలక్షన్లలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పార్టీ నాయకులతో, (మిగతా 2లో.. )

# సీఐపై పోక్సో కేసు నమోదు

రహస్యంగా విచారిస్తున్న పోలీసులు



8లో



# ఏసీబీ వలలో సబ్ రిజిస్ట్రార్ తస్లీమా

సబ్ రిజిస్ట్రార్ తస్లీమా రిజిస్ట్రేషన్ విషయంలో ఒక వ్యక్తి నుంచి శుక్రవారం రూ. 19,200 లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. డాక్యుమెంట్ రైటర్ల వద్ద ఉన్న రూ. 1.78 లక్షలను కూడా ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తస్లీమాను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

-వరంగల్ వాయిస్, మహబూబాబాద్

వివరాలు 2లో..

# మేయర్‌ను గద్దె దించుడే..






**పార్టీలకతీతంగా ఐక్య కార్యాచరణ**

**ఒక్కటవుతున్న కార్పొరేటర్లు**

**పార్టీలు మారడంపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై లేదంటూ మండిపాటు**

**ముంచుకొస్తున్న తాగునీటి ముప్పు**

**కమిషనర్‌ను కలిసి ప్రత్యేక సమావేశం ఏర్పాటుకు పట్టు**



గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణిని గద్దె దించేందుకు పార్టీలకతీతంగా కార్పొరేటర్లంతా ఒక్కటవుతున్నారు. బల్దియా పాలకవర్గం అంటే లెక్కలేని తనం, ప్రజా సమస్యలంటే చిన్న చూపు ఉన్న ఆమెకు వ్యతిరేకంగా ఐక్య కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఇప్పటికే గుండు సుధారాణిని పదవి నుంచి దించే వరకు నిద్రపోనంటూ పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గతంలోనే శపథం చేయగా కార్పొరేటర్లు గుండేటి నరేందర్, ముష్కమల్ల అరుణ-సుధాకర్ వర్గానికి చెందిన పలువురు కార్పొరేటర్లు అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. ఏ చిన్న అవకాశం దొరికినా ఆమెను గద్దె దించేందుకు సమాయత్తమవుతున్నారు. ఆమెను గద్దె దించకపోతే స్థానిక సమస్యలకు పరిష్కారం దొరకదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ మేరకు శుక్రవారం 40వ డివిజన్ పరిధిలోని మంకి ఫుడ్ కోర్టులో కొందరు కార్పొరేటర్లు సమావేశం నిర్వహించడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే నగర అభివృద్ధిపై చర్చించేందుకే ఈ సమావేశం నిర్వహించినట్లు పలువురు కార్పొరేటర్లు చెప్పుకొచ్చారు.

- వరంగల్ వాయిస్, వరంగల్

# మేయర్‌ను గద్దె దించుడే


వరంగల్ వాయిస్, ఫైల్ ఫొటో..

- పార్టీలకతీతంగా ఐక్య కార్యాచరణ
- ఒక్కటవుతున్న కార్పొరేటర్లు
- పార్టీలు మారడంపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై లేదంటూ మండిపాటు
- ముంచుకొస్తున్న తాగునీటి ముప్పు
- కమిషనర్‌ను కలిసి ప్రత్యేక సమావేశం ఏర్పాటుకు పట్టు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణినిపై కార్పొరేటర్లు కారాలు, మిరియాలు నూరుతున్నారు. స్థానిక సమస్యలపై పట్టింపులేని ఆమె వ్యవహార శైలిని ఎండకడుతున్నారు. పార్టీ మారడంపై ఆమె చూపిస్తున్న శ్రద్ధ ప్రజా సమస్యలపై చూపించకపోవడంపై మండి పడుతున్నారు. నగరంలో తాగునీటి ఎద్దడి ముంచుకొస్తున్నా ఉలుకూ, పలుకూ లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కోడ్ వస్తుందని తెలిసినప్పటికీ బడ్జెట్ సమావేశం నిర్వహించకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. 20 రోజుల క్రితమే పలువురు కార్పొరేటర్లు మేయర్ ను కలిసి బడ్జెట్ సమావేశం ఏర్పాటు చేయాల్సిందిగా కోరినప్పటికీ ఆమె పెడ చెవిన పెట్టడం రాజకీయ అవగాహన లేమికి నిదర్శనమంటూ విమర్శిస్తున్నారు. పదవిని కాపాడుకునే క్రమంలో ఆమె ప్రజల సమస్యలను, బడ్జెట్ సమావేశాన్ని పూర్తిగా విస్మరించారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్టీలు మారుతూ పదవిని కాపాడుకోవడంపై మేయర్ చూపించిన శ్రద్ధ ప్రజా సమస్యలపై లేకపోవడాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు.

### పార్టీలకతీతంగా ఐక్య కార్యాచరణ..

మేయర్ సుధారాణి పట్టింపులేని తనం, కార్పొరేటర్లపై చిన్నచూపుతో విసిగి పోయిన వారంతా ఆమెకు వ్యతిరేకంగా ఐక్య కార్యాచరణకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు శుక్రవారం 40వ డివిజన్ పరిధిలోని మంకి ఫుడ్ కోర్టులో తొమ్మిది మంది కార్పొరేటర్లు మేయర్ కు వ్యతిరేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవితోపాటు 39వ డివిజన కార్పొరేటర్ సిద్ధం రాజు, 17వ డివిజన్ కార్పొరేటర్ గద్దె బాబు, 15వ వ డివిజన్ కార్పొరేటర్ ఆకులపెల్లి మనోహర్, 64 వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికా రెడ్డి, 37 వ డివిజన్ కార్పొరేటర్ బోగి సువర్ణ సురేష్, 43 వ డివిజన్ కార్పొరేటర్ ఈదురు అరుణ విక్టరి, 65 వ డివిజన్ కార్పొరేటర్ గుగులోతు దివ్యా రాణీ-రాజు, 55 వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రజిత వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### కమిషనర్‌ను కలిసేందుకు ఏర్పాట్లు..

ప్రజా సమస్యలపై స్పందన లేని మేయర్ ను పక్కనబెట్టి స్థానిక సమస్యలను చక్కదిద్దేందుకు కార్పొరేటర్లు సిద్ధపడుతున్నారు. పార్టీలకతీతంగా కార్పొరేటర్లంతా శనివారం బల్దియా కమిషనర్ ను కలిసేందుకు ప్లాన్ చేస్తున్నారు. స్థానికంగా పేరుకుపోయిన పలు సమస్యల పరిష్కారానికి మార్గం చూపాల్సిందిగా కమిషనర్ ను కోరనున్నారు. లేకుంటే స్థానికంగా ప్రజలనుంచి ఛీత్కారాలకు గురికాక తప్పదంటున్నారు. అవసరమైన కమిషనర్ తో కలిసి వరంగల్ పార్లమెంట్ ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను కూడా కలిసి నిధుల విడుదలపై చర్చించాలని నిర్ణయించారు. ప్రావీణ్య గతంలో బల్దియా కమిషనర్ గా పనిచేసిన అనుభవం ఉన్నందున అక్కడినుంచైనా స్థానిక సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


వరంగల్ వాయిస్, ఫైల్ ఫొటో..

### ఒక్కటవుతున్న కార్పొరేటర్లు..

మేయర్ గుండు సుధారాణిపై యుద్ధం ప్రకటిస్తున్న కార్పొరేటర్లు ఇది అంతం కాదు ఆరంభం అంటూ ప్రకటిస్తున్నారు. ఆమెను గద్దె దించేవరకు ఊరుకునేది లేదంటున్నారు. ఆమెకు ప్రజా సమస్యల పరిష్కారంపై ఇసుమంతైనా పరిజ్ఞానం లేకపోవడంతోనే బడ్జెట్ పట్టాలెక్కలేదన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. బడ్జెట్ సమావేశం లేకపోవడంతో నగరంలో అభివృద్ధి కుంటుపడిందని విమర్శిస్తున్నారు. వేసవి కాలానికి ముందే నగరంలో తాగునీటి ఎద్దడి ముంచుకొస్తున్నా చర్యలు శూన్యమంటున్నారు. అవగాహన లేని మేయర్ తో స్థానికంగా తిరగలేక పోతున్నామంటూ కార్పొరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుధారాణి నిర్లక్ష్యంతో బల్దియాలో పాలన కుంటుపడిందని ఆరోపిస్తున్నారు. గ్రేటర్ వరంగల్ చరిత్రలోనే కేవలం ఏసీ కార్యాలయానికే పరిమితమై సమీక్ష సమావేశాలతోనే నెట్టుకొచ్చిన మేయర్ గుండు సుధారాణి ఒక్కరే అంటూ విమర్శిస్తున్నారు. ఇలాంటి మేయర్ మనకు వద్దంటే వద్దంటున్నారు. ఆమెను ఎట్టి పరిస్థితిలో గద్దె దించుడే అంటూ ప్రకటిస్తున్నారు. ఇదిలా ఉండగా గుండు సుధారాణిని పదవి నుంచి దించే వరకు నిద్రపోనంటూ పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గతంలోనే శపథం చేసిన విషయం విధితమే. కార్పొరేటర్లు గుండేటి నరేందర్, ముష్కమల్ల సుధాకర్ వర్గానికి చెందిన పలువురు కార్పొరేటర్లు సైతం సుధారాణిని గద్దె దించేందుకు అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు.

# పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

**కలెక్టర్ సిక్తా పట్నాయక్**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో హనుమకొండ జిల్లా పరిధిలోని శాయంపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మైలారంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ శుక్రవారం పరిశీలించారు. తాగునీరు, విద్యుత్, టాయిలెట్స్, ర్యాంప్ తదితర సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు, సదుపాయాలను స్థానిక అధికారులతో చర్చించారు. పోలింగ్ కేంద్రాల్లో మొత్తం ఓటర్ల సంఖ్య, కొత్తగా నమోదైన ఓటర్ల సంఖ్య, మార్పులు చేర్పుల గురించి స్థానిక బీఎల్ఓలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

### మధ్యాహ్న భోజనం తనిఖీ..

మైలారంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. భోజనం ఎలా ఉందంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా శాయంపేట తహసిల్దార్ సుభాషిణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### చెక్ పోస్టుల తనిఖీ..

హనుమకొండ జిల్లా పరిధిలోని నడికుడ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎస్ ఎస్ టీ చెక్ పోస్టును జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్ పోస్ట్ కు సంబంధించిన రికార్డులను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీకి సంబంధించి స్టాటిస్టికల్ సర్వేలెన్సు టీంకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా పరకాల ఆర్డీవో డాక్టర్ నారాయణ, పరకాల, నడికుడ తహసిల్దార్లు భాస్కర్, నాగరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియాలో.. మంచితో పాటు చెడు ఉంది

**మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి**




**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** గొంతులేని సామాన్యుల భావ వ్యక్తీకరణకు సోషల్ మీడియా వేదిక అవుతోందని మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అయితే కొందరు ఇదే అదనుగా భావిస్తూ, హద్దు, అదుపు లేకుండా స్వేచ్ఛ పేరిట ఉచ్చరించడానికి వీలుకాని భాషను ఉపయోగిస్తున్నారని, ఇలాంటి వాటిని కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. శుక్రవారం ఫిల్మ్ నగర్ లోని, ఫిల్మ్ ఛాంబర్ లో, టీయూడబ్ల్యూజే అనుబంధ సంస్థ అయిన ఫిల్మ్ క్రిటిక్స్ (సినిమా బీట్ జర్నలిస్టుల) అసోసియేషన్ నిర్వహించిన ఆత్మీయ సత్కార కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. నీతి, నిజాయితీ, నిర్భీతితో పనిచేస్తూ, ప్రజల గొంతుకగా నిలబడే మీడియా సంస్థలకు, జర్నలిస్టులకు తాత్కాలికంగా కష్టాలు ఎదురైనా, భవిష్యత్తులో మంచిరోజులే ఉంటాయని శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. మీడియాను తమ చేతుల్లోకి తీసుకుంటున్న బడా వ్యాపార, వాణిజ్య వేత్తలు వృత్తి ధర్మాన్ని విస్మరిస్తూ, ఇష్టానుసారంగా వ్యవహరించడం సహించరానిదన్నారు. దాదాపు ఆరు దశబ్దాల నుంచి పనిచేస్తున్న ఫిల్మ్ క్రిటిక్స్ అసోసియేషన్ కు నాటి నుంచి నేటి వరకు తాము సంపూర్ణ సహకారాన్ని అందిస్తున్నట్లు శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ప్రముఖ దర్శకుడు తమ్మిరెడ్డి భరద్వాజా, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విరాహత్ అలీ, తెలుగు డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వీర శంకర్, ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి ప్రసన్న కుమార్, ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు కె.సత్యనారాయణ, వయోధిక జర్నలిస్టుల సంఘం అధ్యక్షులు లక్ష్మణ్ రావు, ఫిల్మ్ క్రిటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురేష్, లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శి అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

# నీటిని పొదుపు చేద్దాం.. భావితరాలకు అందిద్దాం

## ప్రొఫెసర్ రతన్ సింగ్ ఠాగూర్




**వరంగల్ వాయిస్, వరంగల్ :** నేడు ప్రపంచ నేటి దినోత్సవం సందర్భంగా ఏవీవీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కొడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నీటి పొదుపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ పర్యావరణ వేత్త ఠాగూర్ రతన్ సింగ్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ సంవత్సరం సందేశం "నీటి, శాంతి" ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకొని నీరు ప్రాణకోటికి జీవధారమని దీనిని పొదుపు చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. లేకుంటే భవిష్యత్ తరాలకు మనం ఊహించుకోలేని పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. ఇప్పుడు నీటిపై వ్యక్తిగత , సామాజిక , జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి, దేశస్థాయిలో యుద్ధాలు జరిగే అవకాశం ఉందని, కాబట్టి, ప్రతి ఒక్కరూ నీటిని పొదుపు చేసి అందరికీ నీటిని అందే విధంగా చేయాలన్నారు. ఈ సందర్భంగా తమ చుట్టుపక్కల వారికి నీటి పొదుపై అవగాహన కలిగించి నీటిని పొదుపు చేయాలన్నారు. అలాగే కోడిమాల శ్రీనివాసరావు మాట్లాడుతూ నీరు ప్రాణకోటికి ఎంతో ముఖ్యమని దీనిని సంరక్షించే అవసరం ఎంతైనా ఉందని ఈ సందర్భంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ అధ్యాపకులు వీరేశలింగం, సామాజిక కార్యకర్తలు విజయరావ్, సర్వేశ్వం, ఆధ్యాపకులు పాల్గొన్నారు.

# నీరు మనిషి మనుగడకు ఆధారం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రకృతి మానవుడికి ప్రసాదించిన సహజ వనరుల్లో ఒకటైన నీటిని పొదుపుగా వాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిదని ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నీరే జీవమని నీరు మనిషి మనుగడకు ఆధారమని నీరు మానవునికి సర్వస్వమని నీటి వనరులను జాగ్రత్తగా సంరక్షించుకుంటూ రాబోవు భావితరాలకు వాటిని అందించాల్సిన బాధ్యత, నీటి విలువను చిన్నారులకు తెలియజేయవలసిన బాధ్యత ప్రతి ఒక్క తల్లిదండ్రులకు ఉందని ఆయన అన్నారు. నీటి వృధాను అరికట్టాలని, నగరంలో రాబోవు ఎండాకాలంలో నీటి కొరత రాకుండా మున్సిపల్ అధికారులు లీకేజీలను అరికట్టి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా బుగులు వెంకటేశ్వర స్వామి కల్యాణం

## హాజరైన ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**వరంగల్ వాయిస్, చిల్పూరు :** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలోని చిల్పూర్ శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం నిర్వహించిన స్వామి కల్యాణ మహోత్సవానికి స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరై స్వామి కల్యాణ వేడుకను వీక్షించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలపై శ్రీ బుగులు వేంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

# చదువుతో సామాన్యుడు శక్తివంతంగా మారవచ్చు

## జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ పరికిపండ్ల అశోక్




**వరంగల్ వాయిస్, జనగామ:** ఒక మనిషి శక్తివంతమైన ఆలోచనలు, నమ్మకాలు, అలవాట్లు ప్రవర్తనలతో ఉన్న సామాన్యుడు కూడా శక్తివంతంగా మారవచ్చునని సైకాలజిస్ట్ ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. విద్యతోనే సమాజంలో గౌరవం-ముందడుగు సాధ్యమని, శాస్త్రీయ ప్రణాళిక -పునస్చరణతో పరీక్షల్లో విజయం సాధించవచ్చునని తెలిపారు. విద్యార్థులు చదువుకునే వయసులోనే వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని, ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. చదువు అనే నిచ్చెనతో ఎంత ఎత్తుకైనా ఎదగవచ్చునని, విద్యార్థులు ఇటువంటి ప్రేరణ కార్యక్రమాలను సద్వినియోగపరుచుకోవాలని అశోక్ పిలుపునిచ్చారు. గురువారం జనగామ జిల్లా, కిలా షాపూర్ కస్తూర్బా విద్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ సునీత అధ్యక్షతన, ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రేరణ కార్యక్రమంలో డా :అశోక్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ గత పది సంవత్సరాలుగా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచిత ప్రేరణ సదస్సులు నిర్వహించడం అభినందనీయమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల పరీక్ష ఫలితాలను పెంపొందించేందుకు పరీక్షల్లో విజయం సాధించాలంటే అనే అంశంపై ఉచితంగా ప్రేరణ సదస్సులు సైకాలజిస్ట్ ల సంఘం సహకారంతో నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు, సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు సద్వినియోగపరచుకోవాలని, వివరాలకు ఫోన్ నెంబర్ 9989310141 లలో సంప్రదించాలని పేర్కొన్నారు. విద్యార్థులు లక్ష్యాలు ఏర్పాటు,చదువుకునే పద్ధతులు, జ్ఞాపకశక్తి మెలకువలు, టెన్షన్ అధిగమించే మార్గాలను సోదాహరణంగా విద్యార్థులకు వివరించారు . తాత్కాలికమైన సమస్యల వల్ల శాశ్వతమైన జీవితానికి చరమాంకం పాడ వద్దని, ఆత్మహత్యలకు చేరువకావద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సహజ, ఇంగ్లీషు, గణితం, సామాన్య శాస్త్రం విషయ నిపుణులు వరుసగా కృష్ణమూర్తి, బాలరాజు, పరమేశ్వర్ లతో పాటు కస్తూర్బా విద్యాలయ ఉపాధ్యాయులు స్వప్న, రాజ్యలక్ష్మి, దేవి, ప్రభ, శ్రీలత, వినోద, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# కోలన్ కాన్సర్ పై అవగాహన



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కోలన్ క్యాన్సర్ (పెద్ద ప్రేగు క్యాన్సర్) కు సంబంధించి ప్రజలలో అవగాహన కల్పించడం కోసం శుక్రవారం కూరపాటి హాస్పిటల్ యాజమాన్యం డా. కూరపాటి రాధికా రమేష్ గోడ పత్రిక ను ఆవిష్కరించి, చైతన్య రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ప్రస్తుత జీవన విధానంలో పెద్ద పేగు కాన్సర్ కూడా ఒక మహమ్మారిలా వ్యాప్తి చెందిందని అన్నారు. మలంలో రక్తం పడటాన్ని సాధారణ పైల్స్ గా భావించి నాటు వైద్యుల సలహాలు తీసుకోవడం, లేటుగా గుర్తించడం, 50 సంవత్సరాల వయసు పైబడిన వారిలో ఎక్కువ గా గుర్తించడం వలన కాన్సర్ బారిన పడాల్సి వస్తుందన్నారు. కాబట్టి మలంలో రక్తం పడటాన్ని ప్రారంభ దశలలోనే గుర్తించి డాక్టర్ సలహాలు పొందటం వలన కాన్సర్ నుంచి విముక్తి పొందవచ్చని తెలిపారు. అలాగే డాక్టర్ రాధికా మాట్లాడుతూ స్త్రీలలో కూడా ఇటువంటి ఇబ్బందులు ఉన్నాకూడా సిగ్గు బిడియం వలన తగిన సమయంలో డాక్టర్ సలహాలు తీసుకోకపోవడం వలన వ్యాధి బారిన పడాల్సి వస్తుందన్నారు. కాబట్టి ఎర్లీ స్టేజ్ లోనే తగిన సలహాలు తీసుకోవాలని సూచించారు. వీటిని ముందుగా గుర్తించి తగిన చికిత్స తీసుకోగలిగితే కాన్సర్ బారిన పడే అవకాశాలు తక్కువగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ డాక్టర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉచిత డయాబెటిక్ క్యాంప్



**వరంగల్ వాయిస్, పోచమ్మ మైదాన్ :** వరంగల్ నగరంలోని పోచమ్మ మైదాన్ జంక్షన్ వద్ద మూసి వేసిన పెట్రోల్ పంపు ఎదుట శుక్రవారం ఉచిత డయాబెటిక్ క్యాంప్ నిర్వహించారు. మన దేశంలో మారుతున్న జీవన శైలి , ఆహారపు అలవాట్ల వలన షుగర్ వ్యాధి బారిన పడే వారి సంఖ్య పెరుగుతుందని, కాబట్టి, ప్రతి ఒక్కరూ షుగర్ టెస్ట్ రెగ్యులర్ గా చేయంచుకోవాలని హాస్పిటల్ వైస్ చైర్మన్ డాక్టర్ తిరుపతి రెడ్డి, సంరక్ష హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ ప్రముఖ డయాబెటిస్ స్పెషలిస్ట్, సీనియర్ ఫిజిషియన్ డాక్టర్ అజిత్ మహమ్మద్ కోరారు. ఉచిత డయాబెటిక్ క్యాంపులో వారితో బాటు పోలా మహేష్ తదితరులు పాల్గొని వైద్య సేవలు అందించారు. సంరక్ష హాస్పిటల్ ఆధ్వర్యంలో వరంగల్ లో 21 చోట్ల , వేరువేరు తేదీలలో "ఉచిత డయాబెటిక్ (మధుమేహ) స్క్రీనింగ్ క్యాంపులు" నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంరక్ష హాస్పిటల్ సిబ్బంది సురేష్ కుమార్, రవి కిరణ్, నీరజ, సృజన్, మహేష్, రాజ్ కుమార్, రవి, నీరజ, సుమలత, సారిక, రమాదేవి, తదితరులు పాల్గొని వైద్య శిబిరంలో సేవలందించారు. ఈ క్యాంప్ లో 133 మందికి (స్త్రీ,పురుషులకు) ఉచితంగా రక్త పరీక్షలు, వైద్య సేవలందించారు. 40మందికి మధుమేహం, రక్తపోటును గుర్తించారు.

# అక్రమ లే అవుట్ వెంచర్లు చేస్తే కఠిన చర్యలు

## బల్దియా సిటీ ప్లానర్ వెంకన్న



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అక్రమ లేఔట్ వెంచర్లు చేస్తే కఠిన చర్యలు తప్పవని బల్దియా బల్దియా సిటీ ప్లానర్ వెంకన్న అన్నారు. శుక్రవారం నగర పరిధిలోని 31 డివిజన్ శాయంపేట్ రెవెన్యూ గ్రామం సర్వే నంబర్ 350, 351లలో అనుమతులు పొందకుండా అక్రమంగా చేసిన లే ఔట్ ను పట్టణ ప్రణాళిక విభాగం అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఖలీల్ ఆధ్వర్యంలో డీఆర్ఎఫ్ సిబ్బంది, జేసీబీ డోజర్ సహాయంతో వెంచర్లలో ఏర్పాటు చేసిన మట్టి రోడ్లు, హద్దురాళ్లను తొలగించారు. వారికి నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ నగర పరిధిలో వెంచర్లు చేయాలనుకుంటే ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం టీఎస్ బీపాస్ ద్వారా దరఖాస్తు చేసుకొని అనుమతులు పొందిన తరువాత మాత్రమే నిబంధనకు లోబడి వెంచర్లు చేయడం, హద్దు రాళ్లు ఏర్పాటు చేయడం వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయాలని, నిబంధనలు బేఖాతరు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్లాట్లు కొనుగోలు చేయాలనుకునే వారు నిబంధనల ప్రకారం లే ఔట్లకు అనుమతులు ఉన్నసమగ్ర సమాచారం తెలుసుకున్న తర్వాతే కొనుగోలు చేయాలని, అక్రమ లే ఔట్ లలో ప్లాట్లు కొని ఇబ్బందులు పడి, ఆర్థికంగా నష్టపోవద్దని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే ఏవీఎస్‌కు ఘన నివాళి

## యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోవడం కోసం పోరాటాలు చేయడమే ఉపాధ్యాయ ఉద్యమ ఆదర్శనేత, అమరజీవి అప్పారి వెంకటస్వామికి ఘనమైన నివాళి అవుతుందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం తొర్రూరు మండల కేంద్రంలో యూటీఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి(ఏవీఎస్) 23వ వర్ధంతి సభ యూటీఎఫ్ కార్యాలయంలో సంఘం జిల్లా కార్యదర్శి భిక్షపతి అధ్యక్షతన జరిగింది. ఈ సభలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ "ప్రాంతాల వారీగా, క్యాడర్ల వారీగా, మేనేజ్ మెంట్ల వారీగా ఉపాధ్యాయ ఉద్యమం చీలిపోయిన సందర్భంలో అందర్నీ ఏకతాటిపైకి తెచ్చేందుకు ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ను స్థాపించి, అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యాలుగా రాష్ట్రంలో అగ్రగామి సంఘంగా తీర్చిదిద్దారన్నారు. ఉపాధ్యాయుని సామాజిక హోదా పెంపుదలకు, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు ఉద్యమాలు రూపొందించడంలో అప్పారి కీలక భూమిక పోషించారన్నారు. ఉద్యమ కార్యకర్తలలో మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా, శాస్త్రీయ వైఖరులు పెంచడానికి పాటుపడ్డారన్నారు. పౌరుల్లో, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంచడం రాజ్యాంగం ప్రకారం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఏవీఎస్ స్ఫూర్తితో ఆ విధమైన కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా టీఎస్ యూటీఎఫ్ కోశాధికారి నాగ మల్లయ్య, ఎర్ర వెంకన్న, సీనియర్ నాయకులు బంధు నారాయణ, తొర్రూరు, దంతాలపల్లి, నరసింహులపేట, పెద్దవంగర, నెల్లికుదురు నాయకులు యాకూబ్, రంజిత్, నరసింహస్వామి, అజయ్, యాకయ్య, వంశీకృష్ణ, పార్వతి, చిరంజీవి, లింగరాజు, జనార్ధన్, రాయలు, చైతన్య, వనజ, కే.వెంకన్న, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

## చెక్‌పోస్ట్ తనిఖీ చేసిన కలెక్టర్



**వరంగల్ వాయిస్, పరకాల :** నడికూడ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎస్-ఎస్ టీ చెక్ పోస్ట్ ను శుక్రవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అకస్మాత్తుగా సందర్శించారు. ఈ కార్యక్రమంలో పరకాల రెవిన్యూ డివిజనల్ అధికారి డాక్టర్ కె నారాయణ, నడికూడ తహసీల్దార్ జి నాగరాజు, పరకాల తహసీల్దార్ ఏవీ భాస్కర్, నడికూడ ఎంపీడీవో, మండల రెవెన్యూ ఇన్ స్పెక్టర్ లావుడియా హేమానాయక్ పాల్గొన్నారు.

## పారిశుద్ధ కార్మికుల సేవలు వెలకట్టలేనివి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** స్థానిక మున్సిపల్ కేంద్రం, మహబూబాబాద్ జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో దాత ఆర్ రాకేష్ హ్యూమన్ రైట్స్ కమిటీ మెంబర్ సహకారంతో శుక్రవారం డివిజన్ కమిటీ సభ్యులు, మహబూబాబాద్ జిల్లా కమిటీ సభ్యులు, డాక్టర్స్ కలిసి పేషెంట్లకు, పారిశుద్ధ కార్మికులకు బ్రెడ్ ప్యాకెట్లు, మజ్జిగ, అరటి పండ్లు, పంపిణీ చేశారు. నేషనల్ హ్యూమన్ రైట్స్ అధ్యక్షుడు మంగళపెల్లి హుస్సేన్ మాట్లాడుతూ, కరోనా సమయంలో పారిశుద్ధ కార్మికులు చేసిన సేవలు వెలకట్టలేనివని అన్నారు. ప్రతి ఒక్కరూ సేవా భావం కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్, పల్లెర్ల రమేష్, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ మాచర్ల శ్రీనివాస్, మహబూబాబాద్ జిల్లా నర్కుటి రామరాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు గంధం లాలయ్య, సోషల్ సర్వీస్ గార వీరస్వామి, డివిజన్ కమిటీ మెంబర్ నాగేష్, డివిజన్ కమిటీ సభ్యులు నరేష్, మంగళపల్లి యాకయ్య, మహిళా మండలి సభ్యులు ఆశా వర్కర్లు, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తకొండ జాతర హుండీల లెక్కింపు



**వరంగల్ వాయిస్, కొత్తకొండ :** శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం హుండీలు శుక్రవారం లెక్కించారు. నోట్లు రూ. 8,88,835, నాణెములు రూ. 65,270, మొత్తము రూ. 9,54,105 ఆదాయము వచ్చినట్లు ఆలయ కార్య నిర్వాహణాధికారి పి. కిషన్ రావు తెలిప్నా. బంగారం వెండి వస్తువులు ఏమీ రాలేదని, 9 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ వరంగల్ ఇన్ స్పెక్టర్ డి.అనిల్ కుమార్, కొత్తకొండ గ్రామ ఎంపీటీసీ యాటపోలు రాజమణి శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ సిద్ధమల కృష్ణ, మాజీ చైర్మన్ పిడిశెట్టి కనకయ్య, సిద్ధమల్ల వెంకటేష్, కొంగొండ సమ్మయ్య, కొక్కరకొండ రాజు, జోడు ముంతల రమేష్, బుర్ర రంజిత్ గౌడ్, శ్రీ సరస్వతి సేవా సమితి కొత్తకొండ సభ్యులు, గోమాత సేవా సమితి హుస్నాబాద్ సభ్యులు, ఆలయ అర్చకులు, సిబ్బంది హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ ట్యాంకు సందర్శన



**వరంగల్ వాయిస్, ములుగు :** ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా డ్రింకింగ్ వాటర్ సమ్మర్ యాక్షన్ ప్లాన్‌కు సంబంధించి పాలంపేట గ్రామ ప్రత్యేక అధికారి గ్రామంలోని తాగునీటి కష్టాలను తెలుసుకునేందుకు ఫిల్టర్‌బెడ్, మిషన్ భగీరథ ట్యాంకును శుక్రవారం సందర్శించారు. అలాగే పాలంపేటలోని పల్లె దవాఖానను పరిశీలించారు.

## లకావత్ లక్ష్మినారాయణ నాయక్‌కు రాజ్యసభ ఇవ్వాలి



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** కాంగ్రెస్ అధిష్టానం డాక్టర్ లకావత్ లక్ష్మినారాయణ నాయక్ కు రాజ్యసభ, ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని, గిరిజన శాఖ మంత్రిగా భర్తీ చేయాలని తెలంగాణ పారా మిలిటరీ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర కోఆర్డినేటర్ తేజావత్ రవీందర్ నాయక్ కోరారు. డాక్టర్ వృత్తిలో ఆయన ఎన్నో సేవలు అందించారన్నారు. 2006 - 2011 మధ్య కాలంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిషత్ చైర్మెన్ గా పాలన అందించిన ఆయన భార్య లకావత్ ధన్వాంతి సేవలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. 2018లో పాలకుర్తి నియోజకవర్గం ఇంచార్జిగా నియమితులై సరికొత్త వ్యూహంతో కార్యకర్తలను, పార్టీని బలోపేతంచేసి 2023 శాసన సభ ఎన్నికలో మామిడాల యశస్విని రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించడంలో కీలక పాత్ర పోషించారన్నారు.

## శ్యామల నాయక్‌ను సన్మానించన సీతక్క



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** ములుగు జిల్లా కేంద్రంలో కోరిక శ్యామల నాయక్ కొన్ని సంవత్సరాలుగా కళా నైపుణ్యత కలిగి ప్రదర్శనలు ఇస్తూ పేరుపొందిన కోరిక శ్యామల నాయక్ ను మంత్రి సీతక్క సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ శివరాత్రి సందర్భంగా నల్గొండ నుంచి అనేక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. వచ్చిన భక్తులకు శివపార్వతుల వేషధారణతో అందరికీ కోరిక శ్యామల నాయక్ దంపతులు అద్భుతంగా కనిపించడంతో ఆది దంపతులుగా ఉన్నారని సీతక్క శ్యామల నాయక్ ను అభినందించారు. రాబోయే రోజులలో రాష్ట్రస్థాయి, దేశ స్థాయిలో కళా నైపుణ్యాలతో ముందుకు తీసుకుపోవాలని ఆమె ఆకాంక్షించారు. టీఎన్జీవో అంగన్వాడీ రాష్ట్ర అధ్యక్షుడు పి.రాజు హర్షం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ కోరిక శ్యామల నాయక్ జిల్లాలోని అద్భుతమైన కళా ప్రదర్శనలు ఇచ్చి మలుగు జిల్లాలో ఆదివాసి కుటుంబాలలో కళా నైపుణ్యత గురించి అందరికీ తన వేషధారణతో కళా నైపుణ్యత గురించి చెప్పడం జరిగిందన్నారు. దీనికి హర్షం వ్యక్తం చేస్తూ టీఎన్జీవో ఆధ్వర్యంలో కూడా కోరిక శ్యామల నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి భూక్యలత, సునీత, టీఎన్జీవో నాయకులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్‌ను కలిసిన గంగు ఉపేంద్ర శర్మ



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్, వేయి స్తంభాల దేవాలయ ప్రధాన అర్చకుడు, బ్రాహ్మణ సేవా సమితి గౌరవ అధ్యక్షుడు గంగు ఉపేంద్ర శర్మ శుక్రవారం తెలంగాణ రాష్ట్ర సీఎం ఎనుముల రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. అర్చక ఉద్యోగుల సమస్యలు, వారి వేతనాల గురించి వారికి తెలియజేసి అలాగే నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ చేయించడం జరిగింది.

## వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి

### అదనపు కలెక్టర్ శ్రీజ



**వరంగల్ వాయిస్, తాడ్వాయి :** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఆసుపత్రిలోని ఫార్మసీ గదిని, మందుల లభ్యతను డాక్టర్ రణధీర్, వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. ఇన్ పేషంట్ వార్డులో చికిత్స పొందుతున్న కొండపర్తి గ్రామానికి చెందిన ఇద్దరు గర్భిణీ స్త్రీలను కలిసి వారితో ఆసుపత్రిలో అందుతున్న సేవలు గురించి ఆరా తీశారు. ప్రసూతి గదిని సందర్శించారు. ఆసుపత్రిలో హాజరు పట్టికను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వైద్యాధికారులు వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, సమయపాలన పాటించాలని, రోగులకు సేవలు అందించాలని ఆదేశించారు. కొత్తగా నియమితులైన స్టాఫ్ నర్స్ లతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంలో డీఎంహెచ్ఓ అప్పయ్య, ఆసుపత్రి సిబ్బంది డాక్టర్ రణధీర్ వైద్యాధికారి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కే.శకుంతల, డీపీఎంఓ సంజీవరావు, హెల్త్ సూపర్ వైజర్ సరస్వతి, 55 ఫార్మసిస్ట్ నాగమణి, స్టాఫ్ నర్సులు స్పందన, రంజిత, ఇతర వైద్య సిబ్బంది ఉన్నారు.

## భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని శ్రీ భద్రకాళి అమ్మవారిని శుక్రవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా సామాన్య భక్తులతో పాటు లైన్ లో వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు.

## ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ

### జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకన్



**వరంగల్ వాయిస్, మరిపెడ :** జరగబోయే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రజలంతా సహకరించాలని జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకన్ అన్నారు. శుక్రవారం మరిపెడ పట్టణంలోని లక్ష్మారెడ్డి ఫంక్షన్ హాల్ నుంచి రాజీవ్ గాంధీ విగ్రహ సెంటర్ మీదుగా కార్గిల్ సెంటర్ నుంచి విశ్రాంతి భవనం వరకు పోలీసులు, కేంద్ర బలగాలు, భారీగా వాహనాలతో కవాతు నిర్వహించారు. ఈ సంధర్బంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రాబోయే ఎన్నికలకు సంబంధించి జిల్లా కు కేంద్ర బలగాలు వచ్చాయని, త్వరలో మరిన్ని బలగాల వస్తాయన్నారు. రాబోయే ఎన్నికల సందర్భంగా ఇప్పటి నుంచే సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని అన్నారు. జిల్లాలో మొత్తం 1783 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందులో కొన్నింటిని సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించినట్లు తెలిపారు. ఎవరైనా చట్ట విరుద్ధంగా ప్రవర్తించిన, గొడవలు సృష్టించాలని చూసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. గ్రామంలోని ప్రజలంతా ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా ఉన్నప్పుడే గ్రామము, జిల్లా అభివృద్ధి చెందుతుందని కాబట్టి, ప్రజలంతా వర్గ బేధాలు లేకుండా శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా సహకరించాలని, ఒకరికి ఒకరు కలిసి మెలిసి సామరస్యంగా ఉండాలని తెలిపారు. ప్రజలంతా ఎలక్షన్ సమయంలో పోలీసు వారికి సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. కేంద్ర బలగాల అధికారులతో జిల్లా ఎస్పీ, అదనపు ఎస్పీ జోగుల చెన్నైయ్య, తొర్రూరు డీఎస్పీ సురేష్, సీఐ హత్తి రామ్ నాయక్, ఆర్డీఓ నర్సింహ, తహసీల్దార్ సైదులు, మరిపెడ సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, కవాతులో పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** విశ్రాంత ఉద్యోగుల సంఘాల నేతలతో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరిపి విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లాఅధ్యక్షుడు మైస నాగయ్య కోరారు. మహబూబాబాద్ పట్టణంలో సంఘం జిల్లా కార్యవర్గ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన నాలుగు డీఏలను మంజూరి చేసి పీఆర్సీని ప్రకించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కొలువుదీరిన నూతన ప్రభుత్వం ప్రతినెల ఒకటిన పెన్షన్లు చెల్లించడం హర్షనీయమన్నారు. జిల్లా కేంద్రంలో వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాప్రధాన కార్యదర్శి వలబోజు సోమయ్య, మోహన్‌రావు, రమణయ్య, వెంకటేశ్వర్లు, నారాయణ, వెంకటాద్రి, ప్రసాద్, రాజలింగం, సోమయ్య, చంద్రయ్య, హనుమంత ప్రసాద్, నాగేంధర్ పాల్గొన్నారు.

# ఫొటోగ్రఫీలో రాణిస్తున్న ఫక్రుద్దీన్

**ఉత్తమ ఫొటో కొమురవెల్లి శివసత్తుల ఫొటో**

**ఓపెన్ కలర్ ఫొటో విభాగంలో పసిడి పతకం**

**జాతీయ స్థాయిలో మరిపెడ కీర్తి పతాక**



**వరంగల్ వాయిస్, మరిపెడ :** ఒక ఫొటో వంద వాఖ్యాలతో సమానం. ఒక ఫొటో ఆ సన్నివేశంలోని ఎన్నో భావాలను చూపరులకు వ్యక్త పరుస్తుంది. ఒక చిత్రం ప్రాంతం లేదా ప్రదేశాల భావ సారుప్యతను ప్రపంచానికి వ్యక్త పరుస్తుంది.. అలాంటి చిత్రాన్ని ఒడిసి పట్టే నైపుణ్యం ఫొటో గ్రాఫర్ సొంతం. అలాంటి ఎన్నో చిత్రాలను తన కెమెరాలో బంధించి ప్రపంచానికి ఫొటోగ్రఫీలో కొత్త కొత్త కోణాలను పరిచయం చేసిన వ్యక్తి మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలానికి చెందిన షేక్ ఫక్రుద్దీన్. సుమారు 20ఏళ్ల నుంచి ఫొటో గ్రాఫర్‌గా ఎన్నో ప్రాంతాలు సందర్శించి విభిన్న జాతుల సంస్కృతులను సైతం తన కెమెరాలో బంధించి బాహ్య ప్రపంచానికి పరిచయం చేశారు. రాష్ట్ర స్థాయి నుంచి మొదలుకొని ప్రపంచ స్థాయి ఫొటోగ్రఫీ పోటీల్లో




పాల్గొన్న ఆయన్ని ఎన్నో పురస్కారాలు వరించాయి. ప్రతి మనిషిలోనూ ఓ కళా పోషణ ఉన్నట్లు ఆయన తీసే ప్రతి చిత్రంలోనూ ఓ కొత్త దనం ఉట్టిపడుతుందని తోటి ఫొటోగ్రాఫర్లు, చూసిన వారు అభిప్రాయం వ్యక్తపరుస్తారు. ఈ నేపథ్యంలోనే ఆయన తీసిన చిత్రాలకు మరో పసిడి పురస్కారం వరించింది. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫొటోగ్రఫీ, పీఎంపీ క్లబ్ సంయుక్తంగా జాతీయస్థాయిలో నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీలో జాతీయ స్థాయిలో సుమారు 200మంది ఫొటోగ్రాఫర్లు పలు రాష్ట్రాల నుంచి పాల్గొన్నారు. పోటీలో మరిపెడకు చెందిన షేక్ ఫక్రుద్దీన్ తన కెమెరాలో బంధించిన కొమురవెల్లి శివసత్తుల ఫొటోకు ఓపెన్ కలర్ విభాగంలో పసిడి పతకం లభించింది. జాతీయ స్థాయిలో పసిడి పతకాన్ని గెలుపొందిన ఫక్రుద్దీన్ ను ఫొటోగ్రాఫర్లు, సామాజిక వేత్తలు, పలువురు అభినందించారు.



# నీటిని పొదుపు చేయాలి : డాక్టర్ అనితా రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా అనురాగ్ హెల్పింగ్ సొసైటి ఆధ్వర్యంలో డాక్టర్ అనితా రెడ్డి హనుమకొండ బాలసముద్రంలోని ఆనంద నిలయం బాలికల హాస్టల్ లో నీటి విలువపై అవగాహన సదస్సును, పిల్లలచే నీటిని పొదుపుగా వాడుతామని దుర్వినియోగం చేయమని డాక్టర్ అనితా రెడ్డి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ మానవులు చేస్తున్న తప్పులకు భూగర్భజలాలు తక్కువ అవుతున్నాయని, అడవుల కొట్టి వేత, కాంక్రీటు యుగం ఇండ్లలో చెట్లు పెంచకపోవడం, పకృతిని నిర్లక్ష్యం చేయడంతో వర్షాలు తక్కువ పడుతున్నాయన్నారు. అవసరానికి మించి నీటిని వాడడం వృథా చేయడంతో కొన్నిచోట్ల నీటి కొనుక్కొని వాడవలసి వస్తుందన్నారు. ఇప్పటికైనా దీనిపై దృష్టి పెట్టడం అవసరమని, లేదంటే భవిష్యత్తులో నీటి ఎద్దడిని తట్టుకోవడం చాలా కష్టమని డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనితా రెడ్డి, వార్డెన్ సుజాత, పిల్లలు , సిబ్బంది పాల్గొన్నారు.

# బీజేపీ జెండా పేదలకు అండగా నిలవాలి

### వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** బీజేపీ నాయకులు, శ్రేణులు నిత్యం ప్రజల్లో ఉండాలని, వారికి నిత్యం అండగా నిలుస్తూ.. మేం ఉన్నామనే ధైర్యాన్ని ఇవ్వాలని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా రాయపర్తి మండల విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం శుక్రవారం రాయపర్తి మండల అధ్యక్షులు వడ్లకొండ రవి గౌడ్ అధ్యక్షతన జరగగా బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ పాల్గొని మాట్లాడారు. అనంతరం గంట రవికుమార్ మాట్లాడుతూ బూత్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కష్టపడి పని చేయాలన్నారు. పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా శ్రమించాలని సూచించారు. రాబోయే పార్లమెంటు, ఎమ్మెల్సీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలలో మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను బూత్ స్థాయి వరకు తీసుకెళ్లాలని చెప్పారు. ఏ ఎన్నికైనా సరే కాషాయం జెండా ఎగరడమే లక్ష్యంగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. దేశ రక్షణ, పేదల సంక్షేమం కోసం మరోసారి మోడీ ప్రధాని కావాలని, ఇదే లక్ష్యంతో పని చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో బీజేపీ జెండా ఎగురవేసేందుకు బూత్ స్థాయిలో చేరికలు చేపట్టాలన్నారు. బూత్ కమిటీలు పటిష్టంగా ఉండేలా ప్రణాళికలు చేసుకోవాలన్నారు. నియోజకవర్గస్థాయిలో వచ్చే 7 రోజుల్లో ప్రతి బూత్ కి ఐదుగురు చేరేలా ప్లాన్ చేసుకోవాలని సూచించారు. మనం చేసే ప్రతీ కార్యక్రమం సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేయాలన్నారు. బూత్ ల్లో ప్రతి ఒక్కరినీ కుటుంబ సభ్యుల్లా పలకరిస్తూ వారి కష్టసుఖాలను పంచుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్న తీరును వివరిస్తూ వారిలో చైతన్యాన్ని తీసుకురావాలన్నారు. యువత దేశ భవిష్యత్తు నిర్ణయిస్తుందని, యువత తలుచుకుంటే రాజకీయాలు మారిపోతాయన్నారు. వచ్చే ఎన్నికలలో వరంగల్ జిల్లాలో బీజేపీ జెండా ఎగరవేయడమే మనందరి లక్ష్యంగా ముందుకుసాగుదామని పిలుపునిచ్చారు. పార్టీ బలం పెంచే విధంగా మోడీ కోసం, దేశం కోసం పోరాటం చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి హరిశంకర్, జనగాం జిల్లా ప్రధాన కార్యదర్శి కర్ర శ్రీనివాస్ రెడ్డి. పాలకుర్తి అసెంబ్లీ కన్వీనర్ పూసల శ్రీమాన్, కోకన్వీనర్ కోటేశ్వర్, ఉమ్మడి వరంగల్ జిల్లా శిక్షణ తరగతుల ఇంచార్జి దామోదర్ రెడ్డి, వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి గడ్డం నరేందర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వీర భరత్ వీర్, మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, బీజేవైఎం జిల్లా జనరల్ సెక్రటరీ నూనె అనిల్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ ఏనుగందుల శ్రవణ్ కుమార్, సీనియర్ నాయకులు భీష్మ రెడ్డి, రావుల అనిల్, సందీప్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు పెండ్యాల గణేష్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు గారే అశోక్, బీజేవైఎం జనరల్ సెక్రటరీ మంచాల సుమన్, బీజేవైఎం మండల కార్యదర్శి జక్కుల సందీప్, బూత్ అధ్యక్షులు అనిల్, రాకేష్, భాస్కర్, శ్రీను, రాకేష్, నాగరాజు, దామోదర్, భిక్షపతి, భద్రు నాయక్ పాల్గొన్నారు.

# అవినీతి మచ్చలేని ప్రభుత్వం బీజేపీ

## మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి సీతారాం నాయక్



**వరంగల్ వాయిస్, ములుగు :** కేంద్రంలోని ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం కుంభకోణాలు, అవినీతి మచ్చలేని పాలన కొనసాగించారని, పదేళ్లలో బడగు, బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేశారని మాజీ ఎంపీ, మహబూబాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీర సీతారాం నాయక్ అన్నారు. దేశహితం కోసం ఎన్నో గట్టి నిర్ణయాలు తీసుకున్న మహనీయుడని కొనియాడారు. శుక్రవారం ములుగులోని డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఎంపీ అభ్యర్థితోపాటు క్లస్టర్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీతారాం నాయక్ మాట్లాడారు. దేశం సుభిక్షంగా ఉండాలన్నా, ఎస్సీ, ఎస్టీ, బీసీ అనగారిన వర్గాల అభివృద్ధి జరగాలన్నా మరోసారి కేంద్రంలో మోదీ రావాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీర సీతారాం నాయక్ అన్నారు. కేంద్రంలో ప్రధాని మోదీని మరోసారి గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని, మోదీ పేదల మనిషి అని మాజీ ఎమ్మెల్యే, క్లస్టర్ ఇన్‌చార్జి మార్తినేని ధర్మారావు అన్నారు. ములుగు నియోజకవర్గంలో 303పోలింగ్ బూతులు ఉన్నాయని, ప్రస్తుతం బీజేపీ 303సీట్లు గెలిచిందని, వచ్చే ఎన్నికల్లో మరోసారి గెలిపించుకోవాలన్నారు. ఆర్వాత బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు గరికపాటి మాట్లాడుతూ బీజేపీ అంటేనే క్రమశిక్షణతో కూడుకున్న పార్టీ అని, సాధారణ కార్యకర్త నుంచి ప్రధాని వరకు అందరూ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటారన్నారు. చాయ్ అమ్మిన మోదీని ప్రధానిని చేసిన ఘనత కేవలం బీజేపీకే దక్కుతుందన్నారు. కార్యర్తలు కష్టపడి పనిచేయాలని సూచించారు. కష్టపడ్డ ప్రతీ ఒక్కరికి గుర్తింపు లభిస్తుందని, పార్లమెంటు ఎన్నికల్లో మరోసారి మోదీ నినాదంతో ముందుకు పోవాలన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చింతలపూడి భాస్కర్‌రెడ్డి, అజ్మీర కృష్ణవేణి నాయక్, బీజేపీ యువమోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి నగరపు రమేష్, నాయకులు బానోతు దేవీలాల్, ప్రతాప్, అజ్మీరా ప్రహ్లాద్, భూక్య రాజు నాయక్, భూక్య జవహర్ నాయక్, బీజేపీ మండల అధ్యక్షులు కారుపోతుల యాదగిరి, మద్దినేని తేజరాజు, గాదం కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ చైతన్య కరపత్రాల ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణ ఐక్య వేదిక, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో తోట పవన్ సౌజన్యంతో హనుమకొండ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి పర్యావరణ చైతన్య కరపత్రాల ఆవిష్కరించారు. సంస్థ చేపట్టే పర్యావరణ హిత కార్యక్రమాలకు తన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి దృష్టికి హనుమకొండ పర్యావరణ సమస్యలను తీసుకెళ్తానని అన్నారు. అలాగే మరో కార్యక్రమంలో వడ్డేపల్లి చెరువు కట్టపై యోగా సభ్యులకు, రవీందర్ రెడ్డి, వాకర్స్ సంఘం అధ్యక్షతన చేపట్టడం జరిగింది. వాకర్స్ కు నీటి దినోత్సవం అవగాహన కలిగించడం, బాలసముద్రంలో గల బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు నీటి కాలుష్యాలపై, నీటి పొదుపుపై అవగాహన కల్పించడంతో అందరిచేత జల ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కాజీపేట పురుషోత్తం, టి.శ్రవణ్ కుమార్, పి.రాజ్ కుమార్, శ్యాం సుందర్ శర్మ, పి.రవిబాబు, వి. శ్రీనివాస్, కె.దామోదర్, ఏ.లక్ష్మణ్ కుమార్, స్వరూప, వెంకటేశ్వర్లు (బెటర్ కాటన్ సంస్థ) ఆశ్రమ పాఠశాలహెడ్ మాస్టర్ శంకరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలంలోని శంకరం తండా గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు అజ్మీరా శ్రీను-సుజాత దంపతుల కుమార్తె స్వాతి-సుమన్ ల వివాహ వేడుకకు హాజరైన శాసన సభ్యుడు దొంతి మాధవరెడ్డి నూతన దంపతులకు ఆశీర్వదించారు. వీరి వెంట జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి మొగిలి వెంకట్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్య గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ లు సిద్దేన రమేష్, తప్పేట రమేష్, తాజా మాజీ సర్పంచ్ భద్రు నాయక్, మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు అమీరొద్దీన్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీష్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు రూపిక శ్రవణ్ కుమార్, సొసైటీ డైరెక్టర్ వీరా రెడ్డి, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు హనుమ నాయక్, మాజీ సర్పంచ్ రాంచంద్రు నాయక్, పత్తి నాయక్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు రవి నాయక్, బుద్దు నాయక్, స్వామినాయక్, మొగులోజు దామోదర్, మురహరి శంకర్, జర్పుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవం



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలంలోని కోనాపురం గ్రామంలో కొలువుదీరిన శ్రీ లక్ష్మి నరసింహాస్వామి కళ్యాణ గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇతర గ్రామాల ప్రజలు కూడా అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ప్రజలందరూ కళ్యాణం వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. కళ్యాణానికి విచ్చేసిన భక్తులందరికీ అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కసివొజ్జల శివకృష్ణాచార్యులు, అయ్యగార్ల బృందం శంకరా శాస్త్రి, గురుబ్రహ్మాచార్య, నాగరాజు, రణధీర్, కౌశిక్, నితిన్, సాయిశర్మ.గ్రామ ఎంపీటీసీ గుండాల మహేందర్, మాజీ సర్పంచ్ వెల్దే సుజాత- సారంగం, మాజీ ఉప సర్పంచ్ మండల నరసింహారావులు, గ్రామస్తులు ఉప్పుల రఘుపతి, మండల అనిల్, గంధం నాగరాజు, ఎడ్ల నరేందర్ రెడ్డి, మల్లేశం, ఇసంపల్లి రాజు, ఠాగూర్ సిద్దు, నూనె చిరంజీవి, కుల పెద్ద మనుషులు, మహిళా మండలి, నామాల రవి, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీలో భారీగా చేరికలు



**వరంగల్ వాయిస్, ములుగు :** దేశంలో మోడీ చేస్తున్న సుపరిపాలనకు ఆకర్షితులై ములుగు మండలం బండారుపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీల యువకులు బీజేపీలో చేరారు. వారికి మహబూబాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అజ్మీరా సీతారాం నాయక్ కాషాయ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన యువకులు పార్టీ కోసం సైనికుడి వలె కృషి చేయాలని కోరారు. దేశంలో మోడీ చేస్తున్న అభివృద్ధి గ్రామాలలో వివరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీలు సహకరించాలి



**వరంగల్ వాయిస్, ములుగు :** లోక్‌సభ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారిని ఇలా త్రిపాఠి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారిణి ఇలా త్రిపాఠి, ములుగు నియోజకవర్గం ఈఆర్ఓ ఐటాడీఏ పీఓచిత్ర మిశ్రా, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ లతో కలిసి లోక్ సభ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారిని ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో లోక్ సభ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ ఏప్రిల్ 18న వస్తుందని, ఏప్రిల్ 18 నుంచి ఏప్రిల్ 25 తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, ఏప్రిల్ 26 వరకు నామినేషన్ల స్క్రూటినీ, ఏప్రిల్ 29 వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉంటుందని, మే 13న పోలింగ్, జూన్ 4 న కౌంటింగ్ నిర్వహణ జరుగుతుందని అన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందని, ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై నేరుగా జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయానికి ఫిర్యాదు చేయవచ్చని, సి-విజిల్ యాప్ ద్వారా లైవ్ వీడియోలతో ఫిర్యాదు చేయవచ్చని, 1950 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా కూడా ఫిర్యాదులు 24 గంటల పాటు నమోదు చేయవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీఓ సత్య పాల్ రెడ్డి, తహసీల్దార్ విజయ భాస్కర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్లు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నీటి సరఫరాలో అవాంతరాలు ఉండొద్దు

## జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి




**వరంగల్ వాయిస్, తాడ్వాయి :** వేసవిలో నీటి సరఫరాలో అవాంతరాలు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం తాడ్వాయి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ తో కలిసి త్రాగు నీటి సరఫరా తీరుపై మండల స్థాయి సమీక్ష సమావేశంలో పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు గ్రామాల్లో నీటి ఇబ్బందులు తీవ్రంగా ఉన్న సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించడానికి ప్రతి గ్రామ పంచాయతీకి సూక్ష్మ ప్రణాళిక (మైక్రో ప్లాన్ ) తయారు చేయాలని, స్థానికంగా ఉన్న పరిస్థితులపై అవగాహన ఏర్పరచుకొని తగు పరిష్కార మార్గాలతో సిద్ధంగా ఉండాలన్నారు. తక్కువ నీరు వచ్చే ప్రాంతాలను (టెయిల్ ఎండ్ ) గుర్తించాలని, వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో ఎన్ని చేతి పంపులు ఉన్నాయి? అందులో పనిచేసేవి ఎన్ని? రిపేరింగ్ దశలో ఎన్ని ఉన్నాయో వాటికి సంబంధించిన ప్రోగ్రెస్ ఉండాలని చెప్పారు. రెండు మూడు రోజుల్లో మరమత్తులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. చివరి పాయింట్ వరకు ఉన్న గృహాలకు నీరు అందించాలని, ఇందుకోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలో స్పష్టత ఉండాలన్నారు. నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్న ప్రాంతాల్లో వాల్వుల పనితీరు పరిశీలించాలని, రాబోయే మూడు నెలలలో గ్రామాలలోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు అందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఐసీడీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోషణ పక్షం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని పౌష్టికాహారం ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించి మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. మనం రోజు తీసుకునే ఆహారంలో మంచి పోషక విలువలు ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో ఆర్ డబ్ల్యూఎస్ సీఈ శ్రీనివాసరావు, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లేశం, ఆర్ డబ్ల్యూఎస్ ఈఈ మాణిక్య రావు, డీఈఈ ఎన్పీడీసీఎల్ నాగేశ్వర రావు, మండల స్పెషల్ ఆఫీసర్ అప్పయ్య, డీడబ్ల్యూఓ స్వర్ణలత లెనినా, తహశీల్దార్ రవీందర్, ఎంపీడీఓ, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శిలు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.






# శరవేగంగా దేవర చిత్రం

టాలీవుడ్ స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్, కొరటాల శివ  కాంబోలో వస్తున్న తాజా చిత్రం 'దేవర ఈ సినిమాలో జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడి పాత్ర పోషిస్తున్నాడు. ఇక ఈ సినిమా రెండు భాగాలుగా రానున్నట్లు మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే.  తొలిభాగం 2024 అక్టోబర్ 10న విడుదల కానుంది. ఇప్పటికే మూవీ నుంచి ఫస్ట్ లుక్‌తో పాటు గ్లింప్స్ విడుదల చేయగా.. ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఇదిలా ఉంటే తాజాగా ఈ సినిమా నుంచి దేవర టీమ్ కొత్త ఫొటోను పంచుకుంది.




# నటుడిగా ఎంట్రీ ఇస్తున్న లోకేశ్ కనగరాజ్

తమిళ స్టార్ దర్శకుడు అంటే టక్కున గుర్తొచ్చే పేరు లోకేష్ కనగరాజ్. 'మానగరం' సినిమాతో కెరీర్ ప్రారంభించిన ఇతడు 'ఖైదీ', 'మాస్టర్', 'విక్రమ్', 'లియో' సినిమాలతో ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీకి బ్లాక్ బస్టర్‌లు అందించాడు. లోకేష్ ప్రస్తుతం రజనీకాంత్ హీరోగా తలైవ 171 ప్రాజెక్ట్ చేస్తున్న విషయం తెలిసిందే. అయితే తలైవా ప్రాజెక్ట్ మొదలు కాకముందే లోకేష్ నటుడిగా ఎంట్రీ ఇవ్వబోతున్నాడు. ప్రముఖ కోలీవుడ్ హీరోయిన్ శ్రుతిహాసన్ 'ఇనిమెల్' అనే మ్యూజిక్ ఆల్బమ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో నటినటిలుగా లోకేష్ కనగరాజ్, శ్రుతిహాసన్ నటిస్తున్నారు. ఇక ఈ ఆల్బమ్‌కు సంబంధించిన ప్రోమోను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ఇక ఈ ప్రోమోలో శృతి, లోకేష్‌ల కెమిస్ట్రీ అదుర్స్ అనిపిస్తుంది. అయితే ఈ వీడియో చూసిన నెటిజన్లు షాక్ అవుతున్నారు. ఇది నిజంగా లోకేశ్ కనగరాజేనా.. అంటూ కామెంట్లు చేస్తున్నారు.

# నూతన దంపతుల సమస్యలపై చిత్రం

కొత్తగా వివాహమైన దంపతులు ఎదుర్కొంటున్న సంతానోత్పత్తి, మానసిక ఒత్తిడి సమస్యలకు పరిష్కార మార్గం చూపే చిత్రంగా 'వెప్పం కులిర్ మళై'  తెరకెక్కింది. 'కుట్రం కడిదల్' చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టరుగా జాతీయ అవార్డును అందుకున్న ఫాస్కల్ వేదముత్తు ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా మారారు. నిర్మాత ధీరవ్ ఇందులో హీరోగా నటించడమే కాకుండా, నిర్మాతగా వ్యవహరించారు. ఇస్మత్ బాను  హీరోయిన్. సీనియర్ నటుడు ఎం.ఎస్. భాస్కర్ముఖ్య పాత్రను పోషించారు. ఈ సినిమా వివరాలను దర్శకుడు వెల్లడించారు. ఫాస్కల్ వేదముత్తుమాట్లాడుతూ... బాహ్య, సామాజిక అంశాలు మానసిక, శారీరక అస్థిరతకు దారి తీస్తాయనే అంశాన్ని ప్రధానంగా ఇందులో చూపించాం. ఈ మూవీ సింహభాగం మానవ సంబంధాలు, భావోద్వేగాలను అన్వేషించేలా సాగుతుంది. 'అసురన్' చిత్రంలో ఇస్మత్ బాను ఒక పాటలో కనిపించినప్పటికీ ఆమె నటన ద్వారా ప్రేక్షకుల్లో గుర్తింపు పొందారు. సీనియర్ నటుడు ఎంఎస్ భాస్కర్ పాత్ర చాలా బాగా వచ్చింది. అత్తగారి పాత్రను నటి రమ పోషించారు. అతి త్వరలో చిత్రాన్ని ప్రేక్షకులముందుకు తీసుకురానున్నామని తెలిపారు.



# లాజిక్‌లోకి వెళ్లకుండా ..

## ఓం భీమ్ బుష్' చిత్రం రివ్యూ

శ్రీవిష్ణు కథానాయకుడిగా నటించిన 'ఓం భీమ్ బుష్' చిత్రం కామెడీ ట్రాక్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. శ్రీవిష్ణుకి తోడుగా కామెడీ గ్యాంగ్  ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ తోడు కావడం... ప్రచార చిత్రాలూ ఆసక్తిని రేకెత్తించచడంతో సినిమాపై మంచి అంచనాలే నెలకొన్నాయి. లెగసీ యూనివర్సిటీలో పీహెచ్‌డీ విద్యార్థులు బ్యాంగ్ బ్రదర్స్ క్రిష్ (శ్రీవిష్ణు), వినయ్ గుమ్మడి (ప్రియదర్శి), మ్యాడీ రేలంగి (రాహుల్ రామకృష్ణ). వీళ్లు చేసే పనులు భరించలేక తక్కువ సమయంలోనే  ముగ్గురికీ డాక్టరేట్లు ఇచ్చి పంపించేస్తాడు కళాశాలలోని ప్రొఫెసర్. దాంతో భైరవపురం చేరుకుంటారు. యూనివర్సిటీ జీవితంలాగే ఆ ఊళ్లో కూడా జల్సాగా బతకాలని నిర్ణయించుకుని సైంటిస్టుల అవతారమెత్తుతారు. ఎ టు జెడ్ సర్వీసెస్ పేరుతో ఓ దుకాణం తెరిచి ఎలాంటి సమస్యలకైనా పరిష్కారం చూపిస్తామని ప్రచారం చేసుకుంటారు. కానీ ఈ ముగ్గురూ నిజమైన సైంటిస్టులు కాదని, ఊరి జనాల్ని బురిడీ కొట్టిస్తున్నారనే విషయం బయట పడుతుంది.  దాంతో ఊరి సర్పంచ్  ఓ పరీక్ష పెడతాడు. సంపంగి మహల్‌లో ఉన్న నిధిని కనిపెట్టి తీసుకొస్తే నిజమైన సైంటిస్టులని నమ్ముతామని చెబుతాడు. దెయ్యం ఉన్న ఆ మహల్‌లోకి నిధి కోసం వెళ్లాక ఈ బ్యాంగ్ బ్రదర్స్‌కి ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి?  ఇంతకీ ఆ మహల్‌లో ఉన్న సంపంగి దెయ్యం కథేమిటి? అసలు వాళ్లు నిధిని తీసుకొచ్చారా? తదితర విషయాలు తెరకెక్కించారు. నో లాజిక్ ఓన్లీ మేజిక్ అంటూ ఉపశీర్షికలో సూచించినట్టే లాజిక్‌తో సంబంధం లేకుండా కేవలం మేజిక్‌నే నమ్ముకుని తెరకెక్కించిన సినిమా  ఇది. 'జాతిరత్నాలు' తరహాలో ముగ్గురు స్నేహితుల క్రేజీ ప్రయాణానికి....  హారర్ కామెడీతో కూడిన ఓ  కాన్సెప్ట్‌ని జోడించి  కథని అల్లుకున్నాడు దర్శకుడు. దెయ్యాలు, ఆత్మలు అంటేనే ఆ కథల్లో  లాజిక్స్‌ని వెదక్కూడదు.  దెయ్యం భయపెట్టిందా లేదా అనేది చూడాలంతే. లాజిక్స్  జోలికి వెళ్లకుండా పాత్రలతోపాటే ప్రయాణం చేస్తే  మాత్రం  బ్యాంగ్ బ్రదర్స్  అక్కడక్కడా కొన్ని నవ్వుల్ని పంచుతారు. సంపంగి దెయ్యం కూడా కొద్దిమేర  భయపెట్టి థ్రిల్ చేస్తుంది. స్నేహితులైన బ్యాంగ్ బ్రదర్స్  కళాశాలలోకి చేరి ప్రొఫెసర్‌ని మాటలతో బురిడీ కొట్టించడం నుంచి కథ మొదలవుతుంది.  ఆ కథ భైరవపురం చేరుకున్నాక, ఆ తర్వాత ఊళ్లో ఎ టు జెడ్ సర్వీసెస్ మొదలయ్యాక అసలు సిసలు హంగామాకి తెర లేస్తుంది. ముగ్గురూ చేసే క్రేజీ పనులు నవ్విస్తాయి. ద్వితీయార్ధంలో కథంతా కూడా సంపంగి మహల్‌లోనే సాగుతుంది. అక్కడ దెయ్యం రాహుల్ రామకృష్ణనీ, ప్రియదర్శినీ భయపెట్టే సన్నివేశాల్లో  పండిన  హారర్, కామెడీ సినిమాపై ప్రభావం చూపిస్తుంది.





# నూకల యూ టర్న్

## కారు దిగి కాంగ్రెస్‌లోకి నరేష్ రెడ్డి

## కాంగ్రెస్‌లో ఆయన 'కల' నేరవేరనుందా..!

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** డోర్నకల్ రాజకీయాల్లో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల నరేష్ రెడ్డి ఆ పార్టీని వీడి గురువారం రాత్రి సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు. ఈ మేరకు మానుకోట జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఆయనతో పాటు మాజీ ఓడీసీఎంఎస్ చైర్మన్ నూకల వేణుగోపాల్ రెడ్డి, చిన్నగూడూరు జడ్పీటీసీ భర్త మూల మురళీధర్ రెడ్డి, పురుశోత్తమాయిగూడెం మాజీ సర్పంచ్ నూకల అభినవ్ రెడ్డి, మరిపెడ మాజీ సర్పంచ్ రామ్ లాల్, బాలు జవాన్, ముంచు అశోక్ కాంగ్రెస్ లో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రాంచంద్ర నాయక్ ఏఐసీసీ మాజీ సభ్యులు సురేందర్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి రాజకీయ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి తదితరులు వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

### ఎప్పుడూ నిరాశే..

1989 లో మొట్టమొదటిసారి యువనేతగా రాజకీయ ఆరంగేట్రం చేసిర నూకల నరేష్ రెడ్డికి డోర్నకల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా టికెట్ అందినట్టే అంది చేజారింది. తొలిసారి ధరంసోత్ రెడ్యానాయక్ కు కాంగ్రెస్ టికెట్ రావడంతో నరేష్ రెడ్డికి నిరాశే మిగిలింది. రెండో ప్రయత్నంలోనూ కాంగ్రెస్ టికెట్ దక్కక పోవడంతో ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. మూడో సారి టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దిగినప్పటికీ ఓటమి తప్పలేదు. నాలుగో సారి టిడీపీనుంచే టికెట్ ఆశించినప్పటికీ చంద్రబాబు నిరాకరించి తూనికలు, కొలతల శాఖ అధికారి జయంత్ నాథ్ కు టికెట్ ఇవ్వడంతో మనస్థాపానికి గురైన నూకల కొంతకాలం రాజకీయాలకు దురంగా ఉన్నారు. ఐదో సారి డోర్నకల్ అసెంబ్లీ ఎస్టీ రిజర్వ్ కావడంతో సత్యవతి రాథోడ్ ను గెలిపించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేసి తన చిరకాల ప్రత్యర్థి రెడ్యానాయక్ ను ఓడించడంలో సక్సెస్ అయ్యారు. ప్రత్యక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో గులాబీ కండువా కప్పుకొని టీఆర్ఎస్ లో చేరారు.

### 30 ఇయర్స్ ఇండస్ట్రీ..

30 సంవత్సరాలుగా రాజకీయాలు చేస్తూ నియోజకవర్గంలో మంచి పట్టు, అభిమానుల ఓటు బ్యాంక్ ఉన్న ఆయనకు ఇప్పటివరకు ఓ నామినేటెడ్ పదవి కానీ ప్రజాప్రతినిధిగా విజయం కాని దక్కలేదు. దీంతో తిరిగి యూ టర్న్ తీసుకున్న నూకల నరేష్ రెడ్డి త్వరలో నియోజకవర్గంలో భారీ బహిరంగ సమావేశం ఏర్పాటు చేసి ప్రతి గ్రామం నుంచి పెద్ద మొత్తంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు జరిగేలా ప్లాన్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నూకల నరేష్ రెడ్డిని కాంగ్రెస్ సర్కార్ ఎలా గౌరవిస్తుందో అని ఈ ప్రాంత ప్రజల ఆసక్తిగా గమనిస్తున్నారు. కాంగ్రెస్ ను వీడి టీడీపీ, టీఆర్ఎస్ లో దీర్ఘకాలం పనిచేసిన నెరవేరని ఆ 'కల' తిరిగి కాంగ్రెస్ తోనైనా నెరవేరుతుందా అని అందరూ ఆత్రంగా ఎదురుచూస్తున్నారు. లేదంటే మళ్లీ పార్టీ కోసం పనిచేయడంతోనే సరిపోతుందా అన్న ప్రశ్న ఉద్భవిస్తోంది.రాబోయే రోజులే దీనిని బదలు చేప్పాలి... అప్పటి వరకు అందరూ ప్రేక్షకులుగా ఎదురు చూడాలిందే..మరి..!!



# మాదిగల ఎదుగుదలను అడ్డుకున్నది శ్రీహరే

## ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మాదిగల ఎదుగుదలను అడ్డుకున్నది కడియం శ్రీహరే అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద క్రిష్ణ మాదిగ ఆరోపించారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరంగల్ బిడ్డగా, వరంగల్ జిల్లాకు చెందిన వాడిగా ఇక్కడ రాజకీయాల గురించి మాట్లాడుతానన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మాదిగల రాజకీయ ఎదుగుదలను అడ్డుకున్నది కడియం శ్రీహరి అంటూ మండిపడ్డారు. 40 ఏళ్లుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో కడియం శ్రీహరి మాదిగ అని చెప్పుకుంటూ రాజకీయంగా ఎదుగుతూ వచ్చారని ఆరోపించారు. మాదిగ సామాజివర్గానికి చెందిన రాజకీయ నాయకులను పావులుగా వాడుకుంటూ ఎదిగాడని విమర్శించారు. ఇప్పటివరకు ఏ ఒక్క మాదిగ బిడ్డను కడియం శ్రీహరి ఎదగనివ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక ముందుకూడా ఎదగనివ్వడన్నారు. మాదిగల పేరు చెప్పుకొని కడియం శ్రీహరి రాజకీయంగా ఎంతో లబ్ధిపొందారన్నారు. తాటికొండ రాజయ్యను రాజకీయ కుట్రలతో కడియం శ్రీహరి మోసం చేశాడన్నారు. తెలంగాణ తొలి ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్యకు మొదట గుర్తింపునిచ్చింది ఎమ్మార్పీఎస్ అన్నారు. ఎమ్మార్పీఎస్ నుంచి ఉప ముఖ్యమంత్రి స్థాయికి తాటికొండ రాజ్యం ఎదగడం మాదిగలకు గర్వకారణం అన్నారు. తాటికొండ రాజయ్యకు మళ్ళీ కేసీఆర్ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చేందుకు సిద్ధపడినా కడియం శ్రీహరి చెప్పుడు మాటలతో రాజయ్యను భర్తరఫ్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

# తిమ్మాపురంలో మొక్కజొన్న క్షేత్ర ప్రదర్శన



**వరంగల్ వాయిస్, సంగెం:** ప్రముఖ వ్యవసాయ సంబంధ ఉత్పత్తుల సంస్థ కావేరి కంపెనీ ప్రతినిధులు కేయంహెచ్ -8322 మొక్కజొన్న రకానికి చెందిన పంట క్షేత్ర ప్రదర్శనను తిమ్మాపురం గ్రామం సంగెం మండలంలో శుక్రవారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మొక్కజొన్న ప్రదర్శనకి తిమ్మాపురం, నర్సానగర్, సంగెం, జాటోతు తండ, పటాను తండ గ్రామాలకు చెందిన రైతులు క్షేత్ర ప్రదర్శన లో పాల్గొన్నారు. కావేరీ సంస్థ ప్రతినిధి టిఎస్ యం నితిన్ పంట సమస్యలకు సంబంధించి రైతలకు ఉన్న సందేహాలకు పరిష్కారం చూపారు. ఈ సందర్భంగా నితిన్ కంపెనీ ఉత్పత్తులను వివరిస్తూ.. ఎకరాకు 42 క్వింటాళ్ల పైనా వస్తుందని గింజలు పైనా కొన వరకు వచ్చి బెండు సన్నగా వస్తుందని తెలిపారు. ప్రదర్శనలో పాల్గొన్న రైతు రమేష్, తదితర రైతులు ఇంత మంచి విత్తనం ఇచ్చిన కావేరీ కంపెనీకి కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో కావేరి కంపెనీ ప్రతినిధులు గణేష్, లెనిన్, రాజు పాల్గొన్నారు.

# కోల్డ్ స్టోరేజీల్లో మిర్చి నిలువ చేసుకోవాలి

## తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సోమడి శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కోల్డ్ స్టోరేజీల్లో రైతుల పండించిన మిర్చి బస్తాలను నిలువ చేసుకునేలా అవకాశం కల్పించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సోమడి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వరంగల్ డీఆర్ఓను కలిసి వినతి పత్రం సమర్పించారు. కోల్డ్ స్టోరేజ్ యజమానులు వ్యాపారులతో ములాఖతై రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. తెచ్చిన మిర్చిని కనీసం కోల్డ్ స్టోరేజీల్లో నిలువ చేసుకుందామని పోయినా అవన్నీ నిండుగా ఉన్నాయంటూ రైతులను మోసం చేస్తున్నారన్నారు. దీంతో దిక్కులేని పరిస్థితిలో రైతులు తమ పంటలను తక్కవ ధరకే వ్యాపారులకు కట్టబెడుతున్నారన్నారు. ఈ విషయంలో వ్యవసాయ అధికారులు తగు చర్యలు తీసుకొని మిర్చి రైతులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు జెండా అంబయ్య, కమిటీ సభ్యులు కూచన కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# సీఐ పై పోక్సో కేసు నమోదు

**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ లో గతంలో ఎస్సై గా పనిచేసి ప్రస్తుతం సీఐగా పొరుగు జిల్లాలో పనిచేస్తున్న పోలీస్ అధికారిపై ఫోక్స్ చట్టం కింద కేయూ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం 2022 సంవత్సరంలో కేయూ పోలీస్ స్టేషన్ లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న సదురు అధికారి స్టేషన్ పరిధిలో ఒక మహిళతో సన్నిహిత సంబంధాలు పెట్టుకున్నారు. దీంతో మహిళ భర్త పోలీస్ కమిషనర్ కు ఫిర్యాదు చేయగా విఆర్ కు అటాచ్ చేశారు. అనంతరం సీఐగా పదోన్నతి పొంది ఖమ్మం జిల్లాకు, అటునుంచి భూపాలపల్లి జిల్లాకు బదిలీపై వెళ్లిన సదురు అధికారి ఇంకా సదరు మహిళతో సన్నిహిత సంబంధం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో సదరు మహిళ కూతురిపై కన్నేసిన పోలీస్ అధికారి ల్కెంగిక దాడికి పాల్పడినట్లు ఇటీవల కేయూ పీఎస్ లో బాలిక తల్లి ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన కేయూ పోలీసులు.. గురువారం సదరు అధికారిపై అత్యాచార యత్నం, ఫోక్స్ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా కేయూ ఇన్స్పెక్టర్ సంజీవ్ ను సంప్రదించగా సీఐని కస్టడీలోకి తీసుకొని రహస్యంగా విచారిస్తున్నట్లు తెలిపారు.

# కాంగ్రెస్‌దే ఘన విజయం

( **మొదటి పేజీ తరువాయి..** ) కార్యకర్తలతో ఉత్సాహాన్ని నింపడానికి సమావేశాలు నిర్వహిస్తున్నామని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అన్ని గ్యారెంటీలను వివరిస్తూ ప్రజల్లో దూసుకుపోతమన్నారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ గాంధీ పంచాయతీ సంఘటన్ రాష్ట్ర చైర్మన్ రాచమల్ల సిద్దేశ్వర్, జనగామ జిల్లా అధ్యక్షుడు విజయమనోహర్, బుట్టెడ్డి రాజిరెడ్డి, మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బడికే ఇందిరా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సర్వల నర్సింగ రాజు, యూత్ కాంగ్రెస్ జనగామ జిల్లా అధ్యక్షులు బనుక శివరాజ్ యాదవ్, జనగామ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వంగాల కళ్యాణి,జనగామ పట్టణ అధ్యక్షులు చెంచారపు బుచ్చిరెడ్డి, వంగాల మల్లారెడ్డి, నిమ్మతి మహేందర్ రెడ్డి,ఆలేటి సిద్దిరాములు,బొట్ల నర్సింగరావు, చెంచారపు కరుణాకర్ రెడ్డి, జనగామ మండల ఇంఛార్జి లింగాల నర్సిరెడ్డి, బచ్చన్నపేట మండలం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నూకల బాల్ రెడ్డి, నర్మెట్ట మండల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ రాజబోయిన లక్ష్మీ నారాయణ, మాజీ మార్కెట్ చైర్మన్,మాసాపేట రవీందర్, జనగామ మండల నాయకులు బక్క శ్రీనివాస్, దాసరి శేఖర్,గాజే అనిల్,గొలుసుల దుర్గేష్, మచ్చ ప్రవీణ్, పర్వతాలు, లింగాల వెంకట రామిరెడ్డి, తోటే నరేందర్, రఘు గౌడ్, జనగామ పట్టణ మైనార్టీ సెల్ మహిళా అధ్యక్షురాలు మున్నిబేగం,బృంగి భాస్కర్, లింగాల ఘనపురం మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీలత,మారబోయిన ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com